# పరివర్తన



గురువారం కనుక సాయిబాబా గుడి రష్‌గా ఉంది.

జయంత్ దైవదర్శనం చేసుకుని ఆఫీసుకి బయల్దేరాడు. కొంతదూరం రాగానే అతని దృష్టి ఆ అమ్మాయిపై పడింది.

చాలా అందంగా ఉందా అమ్మాయి. భుజానికి హేండ్‌బ్యాగ్ తగిలించుకొని వడివడిగా నడుస్తోంది.

'బహుశా ఆఫీసుకో, కాలేజీకో టైము అయిపోతున్నది కాబోలు! గుడి ఊరికి రెండు మైళ్ల దూరంలో ఉంది. ఆటోలు దొరకవు. ముందే ఇంటి దగ్గర మాట్లాడుకొని రావాలి. టౌను బస్సు యింకా ఆ రూటులో వేయలేదు. భక్తులకు యిబ్బందే అయినా భగవంతుణ్ణి చూడాలనుకొనేవారు ఆ మాత్రమైనా కష్టపడకపోతే ఎలా?' అనుకున్నాడు.

ఆలోచనల్నుంచి తేరుకొని ఆమె వైపు చూశాడు. ఎండలో వేగంగా నడవటం వల్ల చెమటలు పడుతుంటే చేతిరుమాలుతో తుడుచుకుంటూనే నడవసాగింది.

ఆమె అవస్థ చూసి జయంత్‌కి జాలేసింది. బైక్‌ని ఆమె ప్రక్కన ఆపి, "నేను టౌన్ వైపే వెళ్తున్నాను. మీకు లిఫ్ట్ కావాలంటే రండి!" అని అడిగాడు.

ముందు అతని వైపు కోపంగా చూసిందామె. తర్వాత వెనుకకు చూసి దూరంగా వస్తున్న ఒక ముసలావిడను చూపిస్తూ "మీది అంత జాలిగుండైతే ఆ ముసలావిడకు లిఫ్టివ్వండి. మీకు పుణ్యమూ వస్తుంది. మీ చెంప జాగ్రత్తగానూ ఉంటుంది!" అని తిరిగి వేగంగా నడవసాగింది.

చాలా అవమానంగా ఫీలయ్యాడు జయంత్.

'అసలు తను యిలా ఒక ఆడపిల్లను 'లిఫ్ట్ కావాలా?' అని అడగడమే తన జీవితంలో మొదటిసారి. ఆమె అవస్థ చూసి సాటిమనిషిలా సహాయం చేద్దామని అడిగాడే కాని, మరో దురుద్దేశం లేదు తనకు. తన సాయం అక్కర్లేదనుకుంటే ఏదో ఒకటి మర్యాదగా చెప్పి తప్పించుకోవచ్చు కదా! ఇంత అందమైన ముఖానికి అంత కఠినమైన మనస్సు ఎందుకిచ్చాడో ఆ భగవంతుడు?!'

మోటార్ బైక్‌ని స్టార్ట్ చేస్తూ అనుకున్నాడు జయంత్.

తల్లి నిద్ర లేపితే మెలకువ వచ్చింది నిర్మలకి.

అక్కకు నొప్పులు మొదలయినాయట. తండ్రి క్యాంపు కెళ్లాడు. ఇంట్లో ముగ్గురూ ఆడవాళ్ళే! సమయం... రాత్రి పదకొండున్నరయింది. ఏమి చేయాలో తోచలేదు నిర్మలకు. అక్క కాన్పు దగ్గరకొచ్చినా లీవు పెట్టని తండ్రి మీద, ఫోన్‌కి అప్లయి చేసి సంవత్సరమైనా యింకా యివ్వని టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ మీదా కోపం వచ్చింది నిర్మలకు.

"అమ్మా! ప్రక్కనున్న ఎస్.టి.డి. బూత్ కెళ్లి రమ వాళ్ళ అన్నయ్యను రమ్మంటాను. నీవు అక్కను చూస్తూండు!" చెప్పు లేసుకుంటూ అంది.

"ఇంత అర్ధరాత్రి బయటికి ఎలా వెళ్తావే?"

తల్లి ప్రశ్నని పట్టించుకోకుండా నాలుగిళ్లవతల వున్న ఎస్.టి.డి. బూత్‌లో అడుగుపెట్టి కౌంటర్ ముందున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయింది. అతను గుడి దగ్గర 'లిఫ్ట్ కావాలా?' అని అడిగినతను.

"ఏమిటీ... ఇంత అర్ధరాత్రి?" ఆశ్చర్యంగా అడిగాడు జయంత్.

"మా అక్కకు పెయిన్స్!" ఆందోళన వల్ల ఆమెకు ఏడుపు వచ్చేసింది.

"మరేం ఫర్వాలేదు. డోంట్ వర్రీ! ఏ హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి? మీ యిల్లెక్కడుంది?" అనునయిస్తూ అడిగాడు.

ఆమె చెప్పింది.

జయంత్ వెంటనే తన ఫ్రెండ్‌కి ఫోన్ చేశాడు.

ఐదు నిమిషాల్లో కారు వచ్చింది. జయంత్ షాపు లాక్ చేసుకొని వాళ్ళకు తోడుగా హాస్పిటల్‌కి వెళ్లాడు.

నిర్మల అక్క ఉదయం నాలుగు గంటలకు ప్రసవించింది.

అంతవరకూ తనతోనే ఉండి ధైర్యం చెప్పిన జయంత్‌కి 'థాంక్స్' చెప్పి, గుడి దగ్గర తన ప్రవర్తనకు క్షమాపణ చెప్పింది.

"ఫర్వాలేదండీ! ఆ షాపు మా ఫ్రెండ్‌ది. వాడు ఊరికెళ్తూ ఈరోజు నన్ను చూసుకో మన్నాడు. అయితే నేనే కాదు, అక్కడ ఎవరున్నా మీకు సహాయం చేసేవారు."

"వాళ్ళు చేయడం సహజమే! కానీ, మిమ్మల్ని నొప్పించినా నాకు సహాయం చేశారు. మీ ప్రవర్తనతో నాలో పరివర్తన తెచ్చారు. ఇకనుంచీ నేను ఎవరితోనూ పరుషంగా మాట్లాడి వాళ్ళ మనసు నొప్పించనని మీకు మాట ఇస్తున్నాను" అంది నిర్మల.

"వెరీ గుడ్! సమాజంలో ఎదుటి మనిషి ఫీలింగ్స్‌ని పట్టించుకునేవాళ్ళే కరువవు తున్నారు. కనీసం మనలాంటి చదువుకున్నవాళ్ళయినా అలాకాకుండా ఉండాలి!" సంతోషంగా అన్నాడు జయంత్.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 30 ఆగస్ట్' 2001

కథా నిలయం
6025
శ్రీకాకుళం